* పరుచూరి కోటేశ్వరరావు *

# వెంకడికి తెలుసు

★

కోడి కూసింది. వెంకడు లేచాడు. కోడికూతకు వెంకడి జీవితం బంధించబడింది. చరిత్ర యుగచక్రాలను అమర్చబడినట్లు, అయిదు నిముషాలు వెంకడి రెక్కలు ఆరుగుతాయి. ఫలితం రాగిపైసా మూసపోయబడుతుంది. ఒక నిముషం మంత్రి పుంగవుని చొక్కా పంకాకింద రెపరెపలాడుతుంది. పది రూపాయల నోటు అచ్చవుతుంది.

వెంకడు ముఖం కడుక్కోడు. పెళ్లాన్ని పలకరించడు. పెళ్ళాం కడుపులోఅతుక్కుపడుకొన్న బిడ్డని ముద్దాడడు. సరాసరి యజమాని పొలానికి పరుగెత్తుతాడు. ఢిల్లీలో ఎగిరిన విమానం మద్రాసులో వాలినట్లు. అప్పటికి తన యజమాని ప్రియురాలతో దుప్పటి తన్ని వుంటాడు. సుఖనిద్రకోసం దొర్లాడుతూ వుంటాడు

చలి ఆరోజుని మెలిపెడుతుంది వెంకడి శరీరం శీతోష్ణాన్ని చదువుకోదు, రాయి ప్రాణవాయువును పంచుకోనట్లు. వెంకడి వంటికి బట్టలుండవు. ప్రాణంలేని బట్టలకు కూడ వెంకడు అస్పృశ్యుడే. వెంకడికున్న బట్టలల్లా గాంధిగారి గోచి. మట్టూవున్న గాలి. చలి.

• చిన్న కథ •

నరకం వంచుతాడు వెంకడు. బురదలో చలిలో, చీకటిలో ఒక్కడే రెక్కలాడిస్తూ వుంటాడు. చెట్లు వాటి ఆకులను కదిపినట్లు గాలిలేకపోతే చెట్ల ఆకుల కన్నా విశ్రాంతి దొరుకుతుంది కాని, వెంకడి రెక్కలు మిల్లులో కదిలే మరలలాంటివి నూరు ఆరు కాని-నూరుఎప్పుడూ ఆరు కానేకాదు - వెంకడి రెక్కలు రాత్రి ఎనిమిది గంటలకే నేల వాలేది.

ఎలెక్షన్కు నిలబడ్డ వ్యక్తి డబ్బు ఎందుకు తగలేస్తున్నాడో తెలుసు. కొత్తగా కాంగ్రెసుభక్తులుగా కొందరెందుకు మారుతున్నారో, అది అద్దంలో ప్రతిబింబం లాంటిది. ఇవన్నీ వాళ్ళు పుస్తకాల్లో చదువుకున్నారు కనుక వాళ్ళ బుర్రలు అంతస్థుపై అంతస్థును కట్టగలవు. వెంకడు వాడి రెక్కలను ఎండుపుల్లలను విరిచినట్టు విరుచుతాడు. కాని యెందుకో తెలియదు. వీధిబడిలో చదువుకొంటే తెలిసేదేమో? అందుకే వాడికి జ్ఞానము లేదంటారు, ఎందువల్ల? ఏమో! వాడి బుర్రలోనూ ప్రధాని నెహ్రూ తలలోనూ ఒకేరకమైన పదార్థం కాని వీడు నెహ్రూలాగా మేఘాలకు సామ్యవాదం వప్పజెప్ప లేడు. అని వాడి నుదుట లిఖించింది సమాజం. వెనకడి బుర్రను మట్టిలోనింపారు

చేశారు. నెహ్రూ తలకు మెరుగులు దిద్దుతున్నారు.

శవాన్ని తగలేసే కట్టెలు ఇనుమును కరిగించలేవు. సిగరెట్టును ముట్టించే అగ్గిపుల్లకు సైతం కరుగుతుంది. వెంకడిదేహం ఎండకు వేడెక్కదు. వెంకడి యజమాని శరీరం సుకుమారం. కనుక నాలుగుగోడల మధ్య భద్రపరచబడివుంది. లాంతరు గ్లాసులో దీపంలాగ, ఒక గంట వెంకడు శ్రమిస్తే "జీవిత" బ్యాంకులో వాడి పేర ఒక సంవత్సరం ఖర్చు రాయబడుతుంది. వాడి యజమాని పేర జమ కట్టబడుతుంది. ఆవిధంగా గుమాస్తా "బాలెన్సు షీటు" తయారు చేస్తాడు

వెంకడి బుర్ర వట్టి మట్టిబుర్ర అంటాడు యజమాని బండితోలే వాడు ఎద్దులను తిట్టినట్లు. నిజంగానే వెంకడు ఏమీ ఆలోచించలేడు. వాడియజమాని గంటల తరబడి గట్టుపై కూర్చొని ఆలోచించగలడు. పరుపుపై దొర్లే భార్యచీర నలిగిందేమో? తప్పటడుగులు వేస్తూ కొడుకు జారిపడ్డాడేమో? ఇవాళ యింటివద్ద నాలుగు కూరలా? అయిదా? ఈ విధంగా ఆలోచించగలడు యజమాని. ఇవేమీఆలోచించలేదు వెంకడి బుర్ర. ఆలోచించవమని బుర్రకథలు హెచ్చరించాయి. ఆమోదించమని హరికథలు ఘోషించాయి.

వాడు పెద్దల సుద్దులనుండి నేర్చుకొన్నదీ, అనుభవంలో చదువుకొన్నదీ ఒకే ఒక విషయం. సూర్యుడు ఉదయించటాన్ని, అస్తమించడాన్ని నేర్చుకొన్నట్లు పదహారు గంటలుపని చెయ్యటం, పదహారు అణాలు తీసుకోవటం, అదేవాడిజీవితం.

అంతకన్నా ఒక్క వాక్యమూ లేదు. వెంకడు చల్లపల్లి జమిందారులాగా గిండీ గుర్రపు పందాల్లో డబ్బు పెట్టలేడు, చల్లపల్లి జమిందారు కష్టపడలేనట్లు. వలంలాగ చినిగిన రవికల్లోనుంచి రసాన్ని గుటకలుమింగుతూ ఆస్వాదించలేడు. అందుకే వాడి బుర్ర వట్టి మట్టిబుర్ర. అసలు ఎప్పుడూ సౌందర్యం అనేదాన్ని చూసి ఎరుగదు వాడి జీవితం.

పది గంటలకు కాగపు మెతుకులు పొలానికి మోసుకువస్తుంది వాడి పెళ్లాం. చెట్టు నీడలో కూచుని గబగబా మింగుతాడు, వాటిని గంజితో కలిపి. గ్రీలు యింటను బొగ్గును భోంచేసినట్లు. వాడి నాలుక అందరి నాలుకల్లాగా అన్ని రుచులను 'క్లాసిఫై' చేయగలది. కాని అన్ని రుచులు వాడి నాలుకను వరించవు మన కావ్యాల్లో షడ్రుచులున్నాయి. కాని 'తాతా' నోటికి పది రుచులుపైగా తెలుసు అన్ని ప్రభుత్వాలవీ కలుపుకొని. వెంకడి నాలుకకుమాత్రం రోజూ తెలిసే రుచి ఒకటే. అప్పుల రుచి.

వెంకడు ప్రాగ్దుకేసి చూస్తున్నాడు; రాష్ట్రంకోసం ఆంధ్ర నాయకులు ఢిల్లీకేసి చూస్తున్నట్టు అయితే వెంకడు స్వేదం ఓడ్చుతూ చూస్తాడు విమానాల్లో, రైళ్లల్లో, మీటింగుల్లో, పత్రికల్లోంచి నాయకులు చూస్తారు.

దుబ్బు నరుకుతున్న పారగ వెంకడి కాలును కాటేసింది. కాలువ నీటితో పాటు వాడి నెత్తురు పొలాన్ని తడుపుతోంది. కుంటు కుంటూ యజమాని యింటికి బయలు దేరాడు. జీతపురాళ్లు అడుక్కోవటానికి మందుకోనుక్కోవటానికి. అప్పటికింకా

నీడలో మగ్గిపోయిన యజమాని శరీరం గాలి పోసుకోవటానికి షికారు బయలుదేరింది సంగతి తెలుసుకొన్న యజమాని నోరు నిప్పులు కక్కింది. పని వదలివచ్చినందుకు మండిపడ్డాడు. వెంకడు చచ్చినా ప్రపంచానికి లోటు రాదన్నాడు. వాడు చస్తే ప్రపంచానికి వచ్చేలోటేముంది నిజంగా? యజమాని యింటిలో కుక్క చస్తే మరో కుక్కను డబ్బెట్టి కొనాలి. కూలీలు డబ్బెట్టి కొనుక్కోకుండానే కొల్లలుగా దొరుకుతారు.

తిరుగుముఖం పట్టాడు వెంకడు కుంటు కుంటూనే యింటికి చేరాడు. సూర్యుడు అస్తమిస్తాడుగా. యజమాని ఉరుములకు జడిసి వెంకడి నోరు మూసుకొంది. రిక్త హస్తాలతో తిరిగి వచ్చాడు. వెంకడయితే నోరు మూసుకున్నాడు గాని మరి కోమటికేం పట్టింది నోరుమూసుకోవటానికి. సరుకులకెళ్ళిన వాడి పెళ్లాన్ని దబాయించి డబ్బడిగాడు కోమటి. యీ ప్రపంచంలో ఏది కావాలన్నా డబ్బు కావాలి. చివరకు చావాలన్నా తగలేసేందుకు డబ్బు కావాలి. కొందరు పెద్దలు డబ్బును, జీవితాన్ని విడదీసి మాట్లాడుతారు. వాళ్ళ జీవితాలు డబ్బుల సంచుల్లో హాయిగా నిద్రపోతున్న సమయంలోనే. యింతకీ వెంకడికి యివ్వాళ డొక్కాడదు. రెక్కాడితే డొక్కాడుతుందంటారు. వెంకడికి రెక్కాడినా డొక్కాడటంలేదు. ఎందుచేత? అవిఖంగా వాడి నుదుట రాసిపెట్టబడింది యజమాని చేత.

ఆ రాత్రి వెంకడు బాధపడుతున్నాడు. బాధను 'రికార్డు' చేస్తాయి వాడి నాడులు. కాని బాధ ఎందుకువచ్చిందో వాడిబుర్ర 'డయాగ్నయిజ్' చేయలేదు. కష్టపడ్డా కూడు ఎందుకులేదో వాడికి తెలియదు. తాను పనిచేస్తేనేగాని బ్రతకలేనని మాత్రం తెలుసు. బిర్లాకు తెల్లవ్యాపారులతో రాజీపడితే లాభాలు వస్తాయని తెలుసు.

వీటిని అర్థం చేసుకోలేడు. అందుకే వాడికి బుర్రలేదంటారు. ముక్కుకు నీరు కావాలి. బుర్రకు చదువు కావాలి. అదే వాడికి లోపించింది. పరిస్థితులు, భాగ్యవంతులు, పరిపాలకులు ఏంచేస్తారో వాడికి తెలియదు. బ్రతుకు దుర్భరమై, విసుగెత్తి కోపం తెచ్చుకోవటం తెలుసు. ద్వేషించటం తెలుసు.

అందుకే "మానవుణ్ణి ఆంతరంగికంగాను, బాహ్యంగాను అణచివుంచే ప్రతిదాన్ని, మానవుని శక్తి సంపదల స్వేచ్ఛాభివృద్ధిని అరికట్టే ప్రతిదాన్ని తీవ్రంగా ద్వేషించు" అన్నాడు - మాక్సిం గోర్కీ.